బాన్సువాడలోని మీనా గార్డెన్‌లో శనివారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి – బాన్సువాడ, డిసెంబర్ 21

రక్తదానం మరొకరికి ప్రాణదానం

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, డిసెంబర్ 21 : రక్తదానం మరొకరికి ప్రాణదానం అని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానంతో మరొకరికి అత్యవసర సమయంలో ప్రాణదానం చేసిన వారమవుతామని అన్నారు. సుమారు 60 యూనిట్ల వరకు రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

సీఎం కప్–2024 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న వ్యవసాయ శాఖ ఉద్యోగులు, పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

కామారెడ్డిలో నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

కామారెడ్డి, డిసెంబర్ 21 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నది. ఈ నిరసన కార్యక్రమానికి పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పనికి తగ్గ వేతనాన్ని ప్రభుత్వం అందించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కుషాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సమగ్రశిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి

బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాన్సువాడ, డిసెంబర్ 21 : పట్టణంలోని మిశ్రిగల్లి, టీచర్స్, బీడీ వర్కర్స్, మదీనా, ఇస్లాంపుర, బండగల్లి ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి శనివారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వార్డు మాజీ సభ్యుడు షేక్ అక్బర్, లయాక్, రహీం, అబ్దుల్ ఖాదర్, అంబర్‌సింగ్, ఇర్ఫాన్ ఖురేషి, అక్రం పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మాచారెడ్డి, డిసెంబర్ 21 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. గ్రామాధ్యక్షుడిగా సతీశ్, ఉపాధ్యక్షులుగా నర్సింహులు, సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కార్యదర్శిగా సురేశ్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా వెంకట్, సలహాదారుడిగా భిక్షపతిని ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

నస్రుల్లాబాద్, డిసెంబర్ 21 : నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన గోండ్లె శంకర్(36) అనే రైతు నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకర్ ఈ నెల 6వ తేదీన గ్రామ శివారులోని తన పొలం వద్ద బోరు మోటరు మరమ్మతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపి వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి ప్రభుత్వ దవాఖానకు తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ యోగా ధ్యాన దినోత్సవం

కామారెడ్డి/లింగంపేట(తాడ్వాయి), డిసెంబర్ 21 : జిల్లా కేంద్రంలోని యోగా భవనంలో ప్రపంచ యోగా ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో సురేందర్ హాజరై మాట్లాడుతూ.. యోగా, ధ్యానాన్ని మన నిజజీవితంలో ఒక భాగం చేసుకోవాలని అన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా విద్యను పిల్లలకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, యోగా గురువు గరిపల్లి అంజయ్య గుప్తా, లేబర్ కమిషనర్ కోటేశ్వర్లు, అంతిరెడ్డి, అంజయ్య, అనిల్ రెడ్డి, రమేశ్, గంగాప్రసాద్, వేణు, హిమబిందు, సంధ్య తదితరులు పాల్గొన్నారు. తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామంలో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా గురువు బండి రాములు, ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, నారాయణ, అంబీర్ మనోహర్‌రావు, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా చేస్తున్న సభ్యులు

నస్రుల్లాబాద్‌లో అమిత్ షా దిష్టి బొమ్మతో నిరసన తెలుపుతున్న దళత సంఘ సభ్యులు

దళత సంఘ సభ్యుల నిరసన

నస్రుల్లాబాద్/బాన్సువాడ/బిచ్కుంద, డిసెంబర్ 21 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తావద్ద అంబేద్కర్ సంఘం సభ్యులు, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నస్రుల్లాబాద్‌లోని బోధన్ –బాన్సువాడ ప్రధాన రహదారిపై దళిత సంఘ సభ్యులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. బాన్సువాడలో నిర్వహించిన కార్యక్రమంలో బాన్సువాడ అంబేద్కర్ సంఘం ప్రతినిధి ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ గంగాదర్, నాయకులు ఎజాస్, అంబేద్కర్ సంఘం కార్యదర్శి సుదీర్ కుమార్, కోశాధికారి వినోద్ కుమార్, అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ చైర్మన్ సాయిలు, గంగారాం, మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు సాయిలు, చిన్ను, నస్రుల్లాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాలసాయిలు, శ్రీనివాస్, లక్ష్మణ్, నర్సింహులు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు. బిచ్కుందలో దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రాంచందర్, సాయిలు, హన్మాండ్లు, ఆరీఫ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

కామారెడ్డి, డిసెంబర్ 21 : జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ వారు సుమారు 300 ఉద్యోగాలకు అర్హత ఉన్న అభ్యర్థుల కోసం ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు డిగ్రీ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఈ ఉద్యోగ మేళాను పట్టణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయాలి

కామారెడ్డి, డిసెంబర్ 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా బీడీ కార్మికులకు రూ.4 వేల జీవన భృతి ఇవ్వాలని బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం వారు మాట్లాడారు. బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకట్, జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, జాయింట్ సెక్రెటరీ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు

అదనపు కలెక్టర్ విక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు

కామారెడ్డి, డిసెంబర్ 21 : ఇటీవల నూతనంగా ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టిన టీఎన్జీవోస్ కార్యవర్గ సభ్యులు జిల్లా ఐడీవోసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ విక్టర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ చక్రధర్, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షుడు సాయిలు, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, జాయింట్ సెక్రెటరీ గణేశ్, రమణకుమార్, అబ్దుల్ ఖదీర్, రాజమణి, ఈసీ మెంబర్లు సాయినాథ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

కామారెడ్డి, డిసెంబర్ 21 : 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం కారు బోల్తా పడిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న కారును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పట్టణ శివారులోని రామేశ్వర్‌పల్లి స్టేజీ వద్ద బోల్తా పడింది. పోలీసులు క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తీశారు. కారు బోల్తా పడినప్పటికీ ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

కలెక్టర్ చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకుంటున్న మద్నూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 21: మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ శనివారం తెలిపారు. వాలీబాల్‌లో అబ్దుల్ సమద్(9వ తరగతి), అబ్దుల్ సహద్(10వ తరగతి), హాట్‌డ్రిల్స్‌లో ఎమ్.మహేశ్(ఇంటర్ ద్వితీయ) మొదటి స్థానం, బీ మనోహర్ (ఇంటర్ ద్వితీయ) ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు.

గురుకుల విద్యార్థులకు ఖోఖోలో ప్రథమ బహుమతి..

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 21: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల విద్యార్థులు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. వీరికి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ బహుమతి అందజేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ లింగం అభినందించారు.

మద్నూర్ విద్యార్థులు..

మద్నూర్, డిసెంబర్21:జిల్లాస్థాయిలో నిర్వహించిన సీఎం కప్ టోర్నీలో ఖోఖో పోటీల్లో మద్నూర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌రేట్‌లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకున్నట్లు ప్రిన్సిపాల్ గంగాకిషోర్ తెలిపారు.

విద్యార్థులకు మెడల్స్ ప్రదానం

రామారెడ్డి, డిసెంబర్ 21: రామారెడ్డి ప్రాథమిక పాఠశాలలో శనివారం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కట్ట ఈశ్వర్ వివిధ తరగతుల్లో చదువులో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు పొందిన 20 మంది విద్యార్థులకు మెడల్స్, స్కూల్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనంద్‌రావు, కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, పాఠశాల హెచ్ఎం గోపాల్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూర్‌లో వైద్యశిబిరం

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 21: మండలంలోని తాండూర్ గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మెడిసిటీ హైదరాబాద్ దవాఖాన వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ మెంబర్, అడ్వకేట్ భూమ రవిగౌడ్ తెలిపారు. 250 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు సంజీవులు, కిష్టయ్య, మోహన్‌రావు, హైమద్, చింటు, సంగయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెద్ద కొడప్‌గల్,డిసెంబర్ 21 : పిట్లం మండలంలోని గౌరారం తండా డీఎన్‌టీ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పదోన్నతిపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు జె.ప్రతాప్ సింగ్, ఉపాధ్యాయుడు మొహమ్మద్ గౌస్‌ను ఎంఈవో దేవీసింగ్, రాంపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

గణితం లేనిదే ప్రపంచంలేదు

గోపాల్‌పేట పాఠశాలలో రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మద్నూర్‌లో గణిత శాస్త్ర ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ గంగాకిశోర్

ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌లో మ్యాథమెటిక్స్ డే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మద్నూర్/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డిరూరల్/రామారెడ్డి/మాచారెడ్డి/ బాన్సువాడ రూరల్, డిసెంబర్21: శ్రీనివాస రామానుజన్ అందరికీ ఆదర్శప్రాయుడని, గణితశాస్త్రం లేకుండా నేడు ప్రపంచం ఏ రంగంలో ముందంజ వేయలేదని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గణిత శాస్త్ర ప్రదర్శనను తిలకించిన అనంతరం ఆయన మాట్లాడారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని శ్రీనివాస రామానుజన్ జయంతిని గణిత ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, చిలిపి ప్రశ్నలు, లాజికల్ ప్రశ్నలు, గణితపద్యాలు, గణిత పాటలపై నృత్యాలు ఏర్పాటు చేశారు. గణిత శాస్త్ర విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు కవిత, శ్రీనివాస్, నరేశ్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాము, పీడీ సభాత్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ గాంధీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన గణితానికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మ్యాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులకు గణిత క్విజ్ నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియదర్శిని, విద్యారమణ, సునీత, రాజశేఖర్, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు. సదాశివనగర్ మండలం మర్కల్ మల్లన్నగుట్ట గురుకుల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ (మ్యాథ్స్) గణితం డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు గణితానికి సంబంధించి ఆటలు, షాట్ ట్రిక్స్ ఇన్‌మ్యాథ్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని, అధ్యాపకబృందం పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ పాఠశాలలో రామానుజన్ జయంతి నిర్వహించారు. క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధాయులు నవనీత, అంజలి, రమాదేవి, రజిత, మంజురాణి, గోపాల కృష్ణ పాల్గొన్నారు. గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్ ప్ర భుత్వ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గణితం బోధించే విఠల్, ఆనంద్‌ను తోటి ఉపాధ్యాయులను సన్మానించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయం

సర్వపూర్ పాఠశాలలో రీడింగ్ కార్నర్ ప్రారంభిస్తున్న డీఈవో

గాంధారి, డిసెంబర్ 21: మండలంలోని సర్వపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలితో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు, దాతలు కృషి చేయడం గొప్ప విషయమని డీఈవో రాజు అన్నారు. సర్వపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్, రీడింగ్ కార్నర్ ప్రారంభించారు. విద్యార్థులు చేసిన మాక్ పోలింగ్, నో బ్యాగ్ డే, టీఎల్ఎమ్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాన్సువాడకు చెందిన పప్పు ప్రతాప్ అనే వ్యక్తి 50 వేల రూపాయలతో విద్యార్థుల సౌకర్యార్థం, బీరువా, మైక్‌సెట్, బ్యాండు సెట్, టై బెల్టులు, ప్లేట్సు పాఠశాలకు అందజేశారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ ..

గాంధారి, డిసెంబర్ 21: మండలంలోని పొతంగల్ కలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను డీఈవో రాజు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని సూచించారు. ఎంఈవో శ్రీహరి, హెచ్ఎం రంగారావు, సెక్టోరియల్ అధికారి వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరాలయాన్ని సందర్శించిన డీఆర్డీవో

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 21: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన తాండూర్ త్రిలింగేశ్వరాలయాన్ని డీఆర్డీవో సురేందర్ శనివారం సందర్శించారు. ఆలయంలోని రామేశ్వరుడు, భీమేశ్వరుడు, సోమేశ్వర లింగాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తు, కమిటీ సభ్యులు వెంకన్న, రాజశేఖర్ డీఆర్డీవోను శాలువాతో సత్కరించారు. ఆలయ చరిత్రను వివరించి పుస్తకాన్ని అందజేశారు. ఐకేపీ డీపీఎం సుధాకర్ ఉన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి

గాంధారి, డిసెంబర్ 21: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన ఆయన అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాల ని, కళాశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 21: మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన దాసరి రాము(28)పై శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్‌ను రాము పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి తీసుకువెళ్లాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలికతో యువకుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. బాలిక వాంగ్మూలం తీసుకొని రాముపై పోక్సో చట్టంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్

ప్రధాన కార్యదర్శిగా జెట్టి విజయ్ కుమార్

గాంధారి, డిసెంబర్ 21: జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ జెట్టి విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన శనివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పి శెట్టి సురేశ్ ఆదేశాల మేరకు జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లింగంపేట్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు శివకుమార్ ఎన్నికైనట్లు చెప్పారు. నూతనంగా ఎన్నికైన వారిని తోటి అధ్యాపకులు అభినందించారు.

సమతుల ఆహారంతోనే సరైన ఆరోగ్యం

లింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో ఆహారదినోత్సవం నిర్వహించిన దృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 21: పోషక విలువలు ఉన్న సమతుల ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సరైన ఆరోగ్యం సాధించవచ్చని లింగారెడ్డిపేట్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దాసీరాం అన్నారు. శనివారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆహారోత్సవంతో పాటు జాతీయ గణిత, యోగా దినోత్సవం, పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. పండ్లు, కూరగాయలు , పిండివంటలు వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 21: ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలోని బేగంపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్ఎం ప్రత్యూష ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు.

వసతిగృహంలో రెండో రోజు విచారణ

పెద్ద కొడప్‌గల్ ఎస్సీ బాలుర వసతిగృహంలో విచారణ చేపడుతున్న జిల్లా అధికారులు

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 21 : పెద్ద కొడప్‌గల్ ఎస్సీ బాలుర వసతిగృహంలో గురువారం ఉడికీ ఉడకని అన్నం తినడంతో నలుగురు విద్యార్థులు తీవ్ర కడుపునొప్పితో బాధపడగా ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించిన ఘటన రెండోరోజు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత, ఎఫ్ఎస్ఎవో అధికారిణి సునీత, డీఈవో రాజు, ఏఎస్‌డీవో వెంకటేశ్, తహసీల్దార్ దశరథ్ కలిసి శనివారం విచ